శుక్రవారం 13-09-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 454 పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## పారాలింపిక్స్ అథ్లెట్లతో మోడీ ముచ్చట

### ఎంతోమందికి మీరు స్ఫూర్తిదాయకమని వెల్లడి

ముందడుగు జాతీయం :

పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్ భారత అథ్లెట్ల సత్తా చాటారు. మొత్తం 29 పతకాలను సాధించారు. స్వదేశానికి చేరుకున్న విజేతలతో ప్రధాని మోడీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. అథ్లెట్లను అభినందించారు. దేశం కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా వారితో కాసేపు ముచ్చటించారు. అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన భారత అథ్లెట్లు 29 పతకాలను సాధించడం అభినందనీయం. వారి అంకితభావంతోనే ఇది సాధ్యమైంది. ఎంతోమందికి ఇది స్ఫూర్తిదాయకం" అని ఎక్స్‌లో ప్రధాని మోడీ ప్రశంసించారు. తాజాగా అథ్లెట్లతో మోదీ ముచ్చటిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మిగతా 2లో

## అవసరమైతే రాజీనామా చేసేందుకు సిద్ధం

### చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయలేం


### సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు



ముందడుగు పశ్చిమబెంగాల్:

ప్రజల ప్రయోజనం కోసం అవసరమైతే తాను రాజీనామా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్జీ కర్ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వైద్యులతో సమావేశం కోసం గురువారం దాదాపు రెండు గంటలపాటు ఎదురుచూశానని, అయినప్పటికీ వారి నుంచి స్పందన లేకుండా పోయిందని తెలిపారు. నేటితో ఈ సమస్యకు తెరపడుతుందని ఆశించిన రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెబుతున్నానన్నారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది.

మిగతా 2లో



అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్

మిగతా 2లో




ప్రపంచానికే భారతదేశం ఆదర్శం

మిగతా 3లో



వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్ నానో వ్యాక్సిన్

మిగతా 3లో



సిల్లీ విషయాలు పట్టించుకోను

మిగతా 5లో

## సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి కన్నుమూత

- దేశ రాజకీయాల్లో తీవ్ర విషాదం..
- కమ్యూనిస్ట్ పార్టీకి తీరని లోటు

ముందడుగు జాతీయం:

సీపీఎం పార్టీ అగ్రనేత, జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆయన కన్నుమూశారు.

మిగతా 2లో




## దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే ఛాన్స్..?

### పెట్రోలియం శాఖ కార్యదర్శి సంకేతాలు!

ముందడుగు జాతీయం:

భారత పౌరులకు త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరల భారం నుంచి ఊరట లభించే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ సూచనప్రాయంగా వెల్లడించారు. అంతర్జాతీయంగా ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే అవకాశం ఉందని

మిగతా 2లో



ముందడుగు
శుక్రవారం, 13-09-2024, హైదరాబాద్

## పారాలింపిక్స్ అథ్లెట్లతో
# మోడీ ముచ్చట

(మొదటిపేజీ తరువాయి)

ఈ భేటీలో కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పారాలింపిక్స్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) హెడ్ దేవేంద్ర జజారియా కూడా పాల్గొన్నారు.

పారాలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో స్వర్ణం సాధించిన హర్విందర్ సింగ్.. ప్రధానితో జరిగిన సమావేశంలోని విశేషాలను మీడియాతో పంచుకున్నాడు. "ప్రధాని మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. మా బృందాన్ని ప్రశంసించారు. క్రీడా సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా నా బాణాన్ని ప్రధానికి బహుమతిగా ఇవ్వడం సంతోషంగా ఉంది" అని పంచుకున్నాడు. ఇటీవల పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత్ అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఏకంగా 29 పతకాలు సాధించి ఔరా అనిపించారు. ఇందులో అత్యధిక మెడల్స్ అథ్లెటిక్స్‌లోనే రావడం విశేషం. ఈ విభాగంలో నాలుగు స్వర్ణాలు సహా 17 పతకాలు వచ్చాయి. ఓవరాల్‌గా ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో 18వ స్థానంలో నిలిచింది. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యధిక పతకాలు సాధించడం ఇదే తొలిసారి. 2020లో నిర్వహించిన టోక్యో పారాలింపిక్స్‌లో 5 స్వర్ణాలు సహా 19 పతకాలను భారత్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ సారి అంతకు మించి పతకాల పంట పండించింది.

## అవసరమైతే రాజీనామా
# చేసేందుకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అందువల్ల.. జూనియర్ వైద్యులు డిమాండ్ చేసినట్లు చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయలేం. అయితే.. ఈ భేటీ వీడియో రికార్డింగ్‌కు ఏర్పాట్లు చేశాం. సుప్రీంకోర్టు అనుమతితో ఆ ఫుటేజీని వైద్యులకు అందజేస్తాం. చర్చలు జరిపేందుకు ఇప్పటికే మూడుసార్లు యత్నించాను. వైద్యులు విధులకు దూరంగా ఉండటంతో ఏడు లక్షల మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 27 మంది మృతి చెందారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోను. పెద్దవాళ్లం కాబట్టి వారిని క్షమిస్తాను" అని మమతా బెనర్జీ చెప్పారు.



## అంతరిక్షంలో తొలిసారి
# ప్రైవేట్ స్పేస్‌వాక్

### స్పేస్‌ఎక్స్ పొలారిస్ డాన్ మిషన్ వ్యోమగామి బృందం ప్రపంచంలో

**ముందడుగు వాషింగ్టన్:**

స్పేస్‌ఎక్స్ పొలారిస్ డాన్ మిషన్ వ్యోమగామి బృందం ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బిలియనీర్ జేరెడ్ ఐసాక్‌మ్యాన్ మొదట నడవగా ఆ తర్వాత స్పేస్‌ఎక్స్ ఇంజినీర్ సరహ్ గిల్లిస్ ఆయనను అనుసరించారు. అంతరిక్ష నడకను కేవలం 30 నిమిషాల పాటు నిర్వహించారు. కానీ దీనికి సిద్ధం కావడానికి రెండు గంటలు పట్టింది. ఈ కార్యక్రమంలో కొత్త అంతరిక్ష దుస్తులను పరీక్షించారు. ఐసాక్‌మ్యాన్ అంతరిక్షంలో ఉన్న ఫొటోను స్పేస్‌ఎక్స్ సీఈవో మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. టేకాఫ్ అయిన 15 గంటల తర్వాత 1400.7 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకొని పొలారిస్ డాన్ మిషన్ అరుదైన మైలురాయిని సాధించింది.

## దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే ఛాన్స్..?



(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర మూడేళ్ల కనిష్ఠానికి చేరింది. 2021 డిసెంబర్ తర్వాత బ్యారెల్ చమురు ధర మంగళవారం 70 డాలర్ల దిగువకు చేరింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మందగమనం కొనసాగుతుండడమే దీనికి కారణం. క్రూడ్ ధరలు తగ్గిన వేళ చమురు ఉత్పత్తిని తగ్గించాలని ఒపెక్+ దేశాలు భావిస్తుండగా.. ఉత్పత్తిని పెంచాలని భారత్ కోరుతోంది. మరోవైపు తక్కువ ధరకు లభిస్తున్న రష్యన్ ఆయిల్‌ను వీలైనంత ఎక్కువగా దిగుమతి చేసుకునేందుకు చమురు కంపెనీలు చూస్తున్నాయని పెట్రోలియం శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. దేశంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏడాది మార్చిలో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున ప్రభుత్వం తగ్గించింది. జమ్ముకశ్మీర్, హరియాణ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాల ఎన్నికలు కూడా ఉండడంతో మరోసారి పెట్రో ధరల కోతకు అవకాశం ఉందన్నది మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశంలో 90 శాతం పెట్రోల్ పంపులు ప్రభుత్వ అధీనంలోనే ఉండడంతో ప్రైవేటు రంగ కంపెనీలూ ఆ మేర వాటి ధరలను తగ్గించాల్సి ఉంటుంది.

# సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గత కొన్ని రోజులుగా ఆయన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లిడించారు. ఆయన ఆరోగ్యం విషమించడంతో ఆగస్టు 19న ఎయిమ్స్‌లోని ఎమర్జెన్సీ విభాగంలో ఆయన కుటుంబ సభ్యులు చేర్చారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో చికిత్స అందించారు. అయినా సరే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం తుది శ్వాస విడిచారు. దీంతో కమ్యునిస్ట్ పార్టీలో తీవ్ర విషాదం నెలకొంది. సీతారాం ఏచూరి 1952, ఆగస్టు 12 జన్మించారు. 1952లో మద్రాసులో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించారు. ఈయన తండ్రి ఏచూరి సర్వేశ్వర సోమయాజి, తల్లి ఏచూరి కల్పకం. ఏచూరి బాల్యం హైదరాబాద్‌లోనే గడిచింది. ఇక్కడి ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం దిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో చేరారు. 1970లో సీబీఎస్‌సీ హయ్యర్ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. ప్రఖ్యాత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అక్కడే పీహెచ్‌డీలో చేరినా.. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు కావడంతో దాన్ని కొనసాగించలేకపోయారు. సీతారాం మొదటి భార్య ఇంద్రాణి మజుందార్. జర్నలిస్టు సీమా చిశ్తీని రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం.


1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ మరుసటి ఏడాదే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సభ్యునిగా చేరారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సీపీఎం ప్రధాన



కార్యదర్శి అయ్యారు. 1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో ఏచూరికి చోటు దక్కింది. 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు.

ముందడుగు
శుక్రవారం, 13-09-2024, హైదరాబాద్

## వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్
# నానో వ్యాక్సిన్



**ముందడుగు బీజింగ్ :**

కొవిడ్ 19 వైరస్ పుట్టుకకు ప్రధాన కేంద్రంగా ఉన్న చైనాలోని వుహాన్ ల్యాబ్ నుంచి కీలక ప్రకటన వెలువడింది. ఇప్పటి వరకు పుట్టుకొచ్చిన కరోనా వైరస్‌లతోపాటు, భవిష్యత్తులో వచ్చే వేరియెంట్స్ అన్నింటినీ ఎదుర్కొనే నానో వ్యాక్సిన్‌ను తయారుచేసినట్టు 'వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' సైంటిస్టులు తాజాగా ప్రకటించారు. ఈమేరకు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' కథనం పేర్కొన్నది. దీని ప్రకారం, ప్రస్తుతం ఎన్నో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నా, ఇవి సార్వత్రిక రక్షణ కల్పించలేవు. దీంతో 'నానో వ్యాక్సిన్'ను తయారుచేసినట్టు సైంటిస్టుల బృందం తెలిపింది. గబ్బిలాలు, ఇతర జంతువులపై పరిశోధనలు జరుపుతున్న ఈ ల్యాబ్ నుంచే కరోనా వైరస్ లీకైందని గతంలో పలు దేశాలు అనుమానం వ్యక్తం చేశాయి.

## నిందితులు ఎంతటివారైనా
# వదిలిపెట్టం



**ముందడుగు హైదరాబాద్:**

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన ఘటనలో నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టబోమని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి స్పష్టం చేశారు. వైరల్ ఫీవర్ కారణంగా ప్రస్తుతం తాను సెలవులో ఉన్నట్టు తెలిపారు. కొండాపూర్ కొల్లా లగ్జారియా విల్లాస్‌కు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో కలిసి చేరుకొని మూకుమ్మడిగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడారు. దీనిపై స్పందించిన పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి స్పందించారు. ఈ ఘటనపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని, దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.






## ప్రపంచానికే
# భారతదేశం ఆదర్శం

### చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్

### యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో అన్నదానం
### 16,116కు లడ్డు దక్కించుకున్న చంచల్ గూడ ఎస్పీ శివకుమార్

**ముందడుగు హైదరాబాద్:**

భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ గౌడ్ అన్నారు. ఎర్రంమంజిల్ లోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నవరాత్రులలో గురువారం ఆరవ రోజు సంధర్బంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని, ప్రతి ఒక్కరికి వారి స్వంత ఇష్టాలు ఉంటాయని, ఎవరి మతాన్ని, ఎవరి దైవాన్ని వారి పూజించే అవకాశం మన దేశ సంస్కృతి, ఆచార, సంప్రదాయాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. స్రవంతి, మీడియా కార్యదర్శి జయరాం, కొమటి రమేశ్ బాబు, కొన్నె దేవేందర్, వరికుప్పల గంగాధర్, జి. హరిప్రకాశ్, బత్తిని రాజేశ్, కొక్కుల ప్రశాంత్, డా. అన్నపూర్ణ, గీతానంద్, స్వప్నారెడ్డి, శివనాగరాజు, పాశిగంటి వంశీకృష్ణ, నాగేంద్ర, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

#### వినాయకుడి లడ్డు వేలం

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో లడ్డును వేలం నిర్వహించారు. సంస్థ సభ్యులు హోరాహోరీగా వేలంలో పాల్గొనగా చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ 16116 రూపాయలకు వేలం పాటలో లడ్డు దక్కించుకున్నారు.





ముందడుగు
శుక్రవారం, 13-09-2024, హైదరాబాద్

# అక్కలూ.. ఇవీ మీ హక్కులు!

యావత్ దేశాన్నీ కుదిపేసిన 'కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన' నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును తీసుకొచ్చింది. మహిళలు – పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అప్పుడెప్పుడో 2012లో జరిగిన 'ఢిల్లీ హత్యాచార ఘటన' సందర్భంగా 'నిర్భయ' చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును ఆమోదించింది. - ముందడుగు హైదరాబాద్



ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు – చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

### 1 గృహహింసకు వ్యతిరేకంగా..

గృహహింస నిరోధక చట్టం – 2005.. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

### 2 పనికి తగ్గ జీతం

సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం 'సమాన వేతన చట్టం' అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

### 3 పని ప్రదేశాల్లో రక్షణ

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలు ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

### 4 రాత్రిపూట అరెస్టు వద్దు

సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్‌తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

### 5 అజ్ఞాతం.. మీ హక్కు

లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. 'గోప్యత హక్కు' ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

### 6ఉచిత న్యాయ సేవ

లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

### 7గౌరవానికి భంగం వద్దు!

లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/ మానసిక పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధం.

ముందడుగు
శుక్రవారం, 13-09-2024, హైదరాబాద్

### ఇస్మార్ట్ భామ నభా నటేశ్ కాఫీ టైం..

# లొకేషన్ ఎక్కడో మరి

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ నభా నటేశ్ . ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది. ఈ ప్రాజెక్ట్ తర్వాత మళ్లీ ఆ రేంజ్ సక్సెస్ కోసం ఎదురుచూస్తోంది నభా నటేశ్. సినిమాలతో వినోదాన్ని అందిస్తూనే.. మరోవైపు సోషల్ మీడియాలోను చురుకుగా కనిపించే ఈ భామ కాఫీ బ్రేక్ తీసుకుంది. ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండే ఈ భామ కాస్త రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. సరదాగా కారులో తన కిష్టమైన కేఫ్‌కు వెళ్లింది. బ్లాక్ సన్ గ్లాసెస్‌తో చిరునవ్వులు చిందిస్తూ తనకిష్టమైన కాఫీ తాగింది నభా నటేశ్. ఈ స్టిల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ కాఫీ, దయ, రోజువారి అవసరాలు.. అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఇంతకీ ఈ బ్యూటీ ఎక్కడికెళ్లిందనేది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. ఈ ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవలే ప్రియదర్శితో కలిసి డార్లింగ్‌లో నటించగా.. బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్‌గా నిలిచింది. ఈ భామ ప్రస్తుతం నిఖిల్ సిద్దార్థ నటించిన స్వయంభు చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.





# సిల్లీ విషయాలు పట్టించుకోను

ఇండస్ట్రీలో ఒక స్టార్‌కిడ్‌కు లభించినంత తేలిగ్గా మిగతావాళ్లకు అవకాశాలు రావు. అది వాళ్ల గొప్పతనం కాదు. వారి తల్లిదండ్రుల కష్టం.' అన్నారు ఢిల్లీ భామ రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నెపోటిజానికి సంబంధించిన ప్రశ్న రకుల్‌కి ఎదురైంది. దీనిపై ఆమె ఆసక్తికరంగా స్పందించారు. 'ఇండస్ట్రీలో బంధుప్రీతి ఉన్న మాట వాస్తవం. దీనివల్ల అవకాశాలు కోల్పోయిన వారిలో నేనూ ఒకదాన్ని. అయితే.. నేను సైనికుడి కూతుర్ని. నాన్న సలహాలు, సూచనలతో ఎదిగిన దాన్ని. సిల్లీ విషయాల గురించి ఆలోచించి సమయం వృథా చేసుకునే తత్వం కాదు నాది. అవకాశాలు కోల్పోవడం జీవితంలో ఓ భాగం. ఆ సినిమాలు మనవి కావు.. అనుకొని ముందుకు సాగా. ఏం చేస్తే వ్యక్తిగతంగా ఎదుగుతానో దానిపై శ్రద్ధ పెట్టా. ఆ వ్యక్తిత్వమే నన్ను నిలబెట్టింది. గొప్ప పాత్రలు పోషించేలా చేసింది' అంటూ చెప్పుకొచ్చింది రకుల్. ప్రస్తుతం ఆమె అజయ్‌దేవగణ్‌తో 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నది.